కాముని చెరువు.. కబ్జా

అధికారుల కనుసన్నల్లోనే అవినీతి పర్వం ■ టౌన్ ప్లానింగ్‌కు భారీగా ముడుపులు?

- అక్రమ నిర్మాణాలెన్నో.. అలసత్వంలో అధికార యంత్రాంగం
- పౌరుడి ఫిర్యాదుతో కూల్చివేతలు
- రాఘవేంద్ర కాలనీలో ఆరంతస్తుల భవన నిర్మాణంపై చర్యలు

కూకట్‌పల్లి కాముని చెరువు పక్కన జీరో పర్మిషన్‌తో నిర్మిస్తున్న భారీ భవనం

సిటీబ్యూరో/ కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 15: భవిష్యత్తు తరాల కోసం జల వనరులను రక్షించడం, ప్రస్తుత తరం బాధ్యత అని, చెరువులు, కుంటల అక్రమణ ఏ మాత్రం ఆమోద యోగ్యం కాదని అత్యున్నత న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా.. ఇటీవల నగరంలోని పలు చెరువుల కబ్జాలపై క్షేత్రస్థాయిలో పర్యటించాయి. ఈ పర్యటనలో అధికారుల వైఫల్యాలెన్నో అద్దం పట్టాయి. ఐనా అధికారుల వైఖరిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. కళ్ల ముందు అంతస్తుల మీద అంతస్తులు నిర్మిస్తూ చెరువు ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నా.. అధికారులు అటువైపుగా వెళ్లడం లేదు. పైగా సంబంధిత కబ్జాదారులు ఇచ్చే ముడుపులకు ఆశపడి చెరువుల అన్యాక్రాంతానికి ప్రత్యక్ష కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే కూకట్‌పల్లి కాముని చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన భవన కూల్చివేతలో సగటు పౌరుడు విజేతగా నిలిస్తే.., ఈ ఆక్రమణలో అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా ఆరోపణలు అమితంగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల పనితీరు పట్ల విమర్శలు వెలువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులపై కమిషనర్ జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కాముని చెరువు బఫర్ జోన్‌లో..

కూకట్‌పల్లి కాముని చెరువు బఫర్‌జోన్‌లో వెలిసిన రాఘవేంద్ర కాలనీలో జీరో పర్మిషన్‌తో భారీ భవన నిర్మాణం జరిగినా జీహెచ్ ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చోద్యం చూడటం.., భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్న దశలో ట్విట్టర్‌లో వచ్చిన ఫిర్యాదుతో ఆయా శాఖల అధికారులు స్పందించి హడావిడిగా ఆ భవనాన్ని కూల్చివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాముని చెరువు బఫర్‌జోన్‌లో వెలసిన రాఘవేంద్ర కాలనీలో మొదటగా చెరువు బఫర్ జోన్‌లో చిన్న చిన్న రేకుల రూములు నిర్మించి స్థలాలను ఆక్రమించారు. తదనంతరం, పక్కా భవన నిర్మాణాలు చేసుకుని దర్జాగా ఆ ఇంట్లో నివాసముండటం.. మరికొందరు లక్షలాది రూపాయలకు అమ్ముకోవడం పరిపాటిగా మారింది. తాజాగా, రాఘవేంద్ర కాలనీలో ఓ వ్యక్తి ఆక్రమించిన స్థలం 240 గజాలలో ఆరు అంతస్తుల భవన నిర్మాణ పనులు చేపట్టాడు. కాలనీలు, బస్తీలలో అన్ని డాక్యుమెంట్లు సరిగా ఉన్నా స్థలాలలో ఎవరైనా ఇల్లు కట్టుకోవాలంటే ఆర్కిటెక్చర్‌ను సంప్రదించి భవన నిర్మాణానికి సంబంధించిన సమూనాను సిద్ధం చేసుకుని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అనుమతి తీసుకొని నిర్మాణ పనులు చేపడతారు. కానీ.., రాఘవేంద్ర కాలనీలో చేపట్టిన ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవు. జీరో పర్మిషన్‌తో భారీ భవన నిర్మాణం జరిగినా జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు కనీసం కన్నెత్తి చూడలేదు.

ట్విట్టర్‌లో ఫిర్యాదుతో స్పందన..

కాముని చెరువు సమీపంలోని రాఘవేంద్ర కాలనీలో బఫర్‌జోన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ భవన నిర్మాణం జరుగుతుందని ఓ వ్యక్తి ట్విట్టర్‌లో జీహెచ్ ఎంసీ, ఇరిగేషన్, ఇతర విభాగాల అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు అందిన వెంటనే ఆయా శాఖల అధికారులు రంగంలోకి దిగి ఆ భారీ భవన నిర్మాణానికి చెందిన గోడలు, స్లాబులను కూల్చివేశారు. ఆరు అంతస్తులు అక్రమంగా నిర్మించినా సంబంధిత అధికారులు అటువైపు చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ కాలనీలో ఇదే తరహాలో పలు భవనాలు ఎలాంటి అనుమతులు నిర్మిస్తున్నా ఏ అధికారి అక్కడికి వెళ్లి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణదారులు స్థానికంగా అధికార పార్టీ నేతలు పేర్లు చెప్పుకుంటూ నిర్మాణాల దగ్గరికి అధికారులు వస్తే బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. కాముని చెరువును బఫర్‌జోన్‌లో వెలిసిన రాఘవేంద్ర కాలనీఆలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలన్నింటిపై చర్యలు తీసుకోవాలని ఓ వర్గం నేతలు అధికారులను కోరుతున్నారు.

ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో.. సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, మార్చి 15(నమస్తే తెలంగాణ): భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ పర్యటన నేపథ్యంలో సైబరాబాద్ పరిధిలోని శంషాబాద్, షాద్‌నగర్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఆదేశాలు జారీ చేశారు. శంషాబాద్‌లోని నందిగామ, చేగూరు గ్రామంలోని కన్హా శాంతివనాన్ని ఉప రాష్ట్రపతి శనివారం సందర్శించనుండటంతో ఈ నెల 16 నుంచి 17వ తేదీ వరకు శంషాబాద్, షాద్‌నగర్ ఠాణాల పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్లే వాహనాలను గొల్లపల్లి టోల్‌గేట్, పెద్ద గోల్కొండ, తొండుపల్లి, బుర్జుగడ్డ యూ టర్న్, ముచ్చింతల్, మాన్సాన్‌పల్లి ఎక్స్ రోడ్, తిమ్మాపూర్ మీదుగా అనుమతిస్తారు. అదే క్రమంలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పెంజర్ల ఎక్స్ రోడ్, అమీర్‌పేట, మన్సాన్‌పల్లి ఎక్స్ రోడ్, పెద్ద గోల్కొండ టోల్‌గేట్, శంషాబాద్ మీదుగా అనుమతిస్తారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్లే వాహనాలను గొల్లపల్లి టోల్ గేట్, పెద్ద గోల్కొండ, ముచ్చింతల్, మన్సాన్‌పల్లి ఎక్స్ రోడ్, అమీర్‌పేట్, తిమ్మాపూర్ మీదుగా అనుమతిస్తారు. పెద్ద గచ్చిబౌలి నుంచి వచ్చే వాహనాలను పెద్ద గోల్కొండ టోల్‌గేట్, మన్సాన్‌పల్లి ఎక్స్ రోడ్, అమీర్‌పేట, తిమ్మాపూర్ మీదుగా దారి మళ్లిస్తారు. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పెంజర్ల ఎక్స్ రోడ్, అమీర్‌పేట, మన్సాన్‌పల్లి ఎక్స్ రోడ్, పెద్ద గోల్కొండ టోల్‌గేట్, శంషాబాద్ మీదుగా అనుమతిస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలను చేరుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీ అధినేతను కలిసిన రాగిడి

మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, ధన్యవాదాలు తెలియజేశారు.

- ఉప్పల్, మార్చి 15

ప్రెస్‌క్లబ్ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ – 2024 డైరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వేణుగోపాల నాయుడు, ఆర్.రవికాంత్ రెడ్డితో కలిసి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రావు, సి.వనజ, కోశాధికారి ఏ.రాజేశ్, సంయుక్త కార్యదర్శులు చిలుకూరి హరిప్రసాద్, రమేశ్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఉమాదేవి, వర్దెల్లి బాపూరావు, శ్రీనివాస్ తిగుళ్ల, బి.గోపరాజు పాల్గొన్నారు.

- ఖైరతాబాద్, మార్చి 15

మెట్రో కమాండ్ కంట్రోల్‌లో రజనీకాంత్

ఉప్పల్‌లోని మెట్రో ఆపరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ప్రముఖ సినీ నటులు రజనీకాంత్, పక్కన ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ సీఈఓ, ఎండీ కేవీబీ రెడ్డి తదితరులు.

సిటీబ్యూరో, మార్చి 15(నమస్తే తెలంగాణ): ఉప్పల్‌లోని మెట్రో రైలు ఆపరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రముఖ హీరో రజనీకాంత్ శుక్రవారం సందర్శించారు. ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ సీఈఓ, ఎండీ కేవీబీ రెడ్డి హైదరాబాద్ మెట్రో విశేషాలను రజనీకాంత్‌కు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన మెట్రో ప్రజా రవాణా వ్యవస్థల్లోనే ఎంతో అత్యాధునికమైందని చెప్పారు. మెట్రో రైలు ప్రాజెక్టు చాలా అద్భుతంగా ఉందని, తనను ఈ ప్రాజెక్టు ఆకట్టుకుందని రజనీకాంత్ పేర్కొన్నారన్నారు. ఆపరేషన్ కమాండ్ కంట్రోల్‌లోని సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారని, వారితో కలిసి గ్రూపు ఫోటో దిగారని మెట్రో అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ మెట్రో సీఓఓ సుధీర్ చిపుంకర్, సీఎస్ఓ మురళీ వరదరాజన్‌లు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి చర్యలు

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్
- జీహెచ్‌ఎంసీ విధానాలు భేష్: ట్రైనీ ఐఏఎస్‌ల బృందం ప్రశంస
- రెండు రోజుల పర్యటనలో జీహెచ్‌ఎంసీని సందర్శించిన ఆరు రాష్ట్రాల ఐఏఎస్‌లు

సిటీబ్యూరో, మార్చి 15(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. ఆరు రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు బెస్ట్ ప్రాక్టీసెస్‌పై అధ్యయనం చేయడానికి జీహెచ్ ఎంసీని శుక్రవారం సందర్శించారు. ముస్సోరిలో ట్రైనింగ్ పొందుతున్న హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు చెందిన 16 మంది ఐఏఎస్‌లు రెండు రోజుల పర్యటనలో భాగంగా జీహెచ్‌ఎంసీకి వచ్చారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో కమిషనర్ రొనాల్డ్ రాస్ జీహెచ్‌ఎంసీ బెస్ట్ ప్రాక్టీసెస్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారికి వివరించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సీ అండ్ డీ వేస్ట్ ప్రాసెసింగ్, చెత్త సేకరణ, జీవీపీ, ఎలిమినేషన్, ఎస్ఆర్‌డీపీ , టౌన్ ప్లానింగ్, ఇంటి నిర్మాణ అనుమతులు, యూబీడీ ద్వారా చేపట్టిన గ్రీనరీ, మోడల్ గ్రేవ్ యార్డు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్, మోడల్ మార్కెట్లు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, స్ట్రీట్ లైటింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్, లేక్స్ అభివృద్ధి, పీఎం స్వానిధి, ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ సిస్టం, వేస్ట్ రీసైక్లింగ్, నగర పౌరులకు అందిస్తున్న సేవలు, హరితహారం, నిధుల సమీకరణ, శానిటేషన్‌లపై వివరించారు. నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టిన బెస్ట్ ప్రాక్టీసెస్ బాగున్నాయని ట్రైనీ ఐఏఎస్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లు దుండిగల్, జవహర్ నగర్‌లో గల సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, టీ–హబ్, ఇండస్ట్రీయల్ పార్కును సందర్శించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్‌లు రమేష్ ఆర్.దామోర్, దుని చంద్ రాణా, రోహిత్ జామ్ వాల్, దిశా ప్రణయ్ నాగ్ వంశీ, అనురాగ్ సక్సేనా, శుచి స్మిత సక్సేనా, అవినాష్ ప్రభాకర్ రావ్ పాఠక్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ పితాంబర్ దియోరే, ప్రకాష్ బాబురావు ఖాప్లీ, జీహెచ్‌ఎంసీ అధికారులు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఈఎన్‌సీ జియావుద్దీన్, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, డాక్టర్ సునంద, వెటర్నరీ డీడీ డాక్టర్ విల్సన్ పాల్గొన్నారు.

3.5 లక్షలు బస్సులో మరిచిపోతే..

కాచిగూడ, మార్చి 15: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న బంగారు అభరణాలు కలిగి ఉన్న బ్యాగును బాధితురాలికి అందజేసిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ తన నిజాయితిని చాటుకున్నారు. కాచిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.రఘు తెలిపిన వివరాల ప్రకారం.. మిడ్జిల్‌లోని కొత్తూరు గ్రామానికి చెందిన మిరియాల భాగ్యమ్మ గురువారం బియ్యం బస్తాతో సంతోష్‌నగర్‌లో ఉండే తన కూతురు వద్దకు వెళ్లడానికి కాచిగూడ డిపోకు చెందిన బస్సులో బయలుదేరింది. సంతోష్‌నగర్ బస్టాపులో బియ్యం బస్తాతో భాగ్యమ్మ బస్ దిగి పోయింది. కాగా, ఆ బస్సులో రూ.3.5 లక్షల విలువజేసే బంగారు ఆభరణాలతో కూడిన బ్యాగును మార్చిపోయింది. ఆ బ్యాగును ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ గమనించి వెంటనే కాచిగూడ డిపో మేనేజర్‌కు అందజేశారు. టికెట్ ఆదారంగా భాగ్యమ్మ కాచిగూడకు ఫోన్ చేసి వచ్చింది. బంగారు అభరణాలతో కూడిన బ్యాగును కాచిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.రఘు ఆమెకు అప్పగించారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ నిజాయితిని మెచ్చుకున్న అధికారులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో సీఐ శ్రీనివాస్, ఎస్.ఎం రాములు, డ్రైవర్ డి.యాదయ్య, కండక్టర్ ఎస్.యాదయ్య పాల్గొన్నారు.

టోలిచౌకిలో అగ్ని ప్రమాదం

హ్యూమాయూన్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి, టోలిచౌకి సాలార్జంగ్ కాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నానల్‌నగర్ సాలార్జంగ్ కాలనీ యూసుఫ్ టెక్రి పెట్రోల్ బంక్ వెనుక ఎస్ఎం కుత్బుద్దీన్ (72) అనే వ్యక్తికి సంబంధించిన గోడౌన్ ఉన్నది. షార్ట్ సర్క్యూట్ నేపథ్యంలో మంటలంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్థానిక ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్ తెలిపారు.

- మెహిదీపట్నం మార్చి 15

ప్రభుత్వ స్థలానికి రక్షణ చర్యలు

ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

బంజారాహిల్స్, మార్చి 15: బంజారాహిల్స్ రోడ్ నం.3లోని కంగారు కిడ్స్ స్కూల్ ఎదురుగా ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందంటూ వచ్చిన ఫిర్యాదుతో షేక్‌పేట మండల రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటి వెనకాల ఉన్న ఈ స్థలం చుట్టూ షీట్స్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రహరీ నిర్మిస్తున్నారంటూ తహసీల్దార్ అనితారెడ్డికి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో శుక్రవారం సిబ్బందితో వెళ్లి పరిశీలన చేపట్టారు. నిర్మాణ సామగ్రి ఉన్నందున వాటి రక్షణ కోసం గోడలు కట్టారని, పనులు పూర్తైన తర్వాత తొలగిస్తామని ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు చెందిన సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. దీంతో అక్కడ ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌కు లైబ్రేరీ అసిస్టెంట్ల వినతి

రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో పనిచేస్తున్న తమకు వేతన సవరణలో సరైన న్యాయం చేయాలని లైబ్రేరీ అసిస్టెంట్లు శుక్రవారం పీఆర్‌సీ కమిషన్ చైర్మన్ శివ శంకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయనను కలిసిన వారిలో నిజాం కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ బోయ కుమార్, ఓయూ ఇంజినీరింగ్ కళాశాల లైబ్రేరియన్ అవినాశ్‌లు ఉన్నారు.

- ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 15

రాగల 48 గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో, మార్చి 15(నమస్తే తెలంగాణ): తూర్పు విదర్భ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రాగల 48 గంటల్లో నగరంలోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు శుక్రవారం వెల్లడించారు. ద్రోణి కారణంగా నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 35.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 24.1డిగ్రీలు, గాలిలో తేమ 41 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

భువన తేజ ప్రీలాంచ్ కేసులో ఇద్దరి అరెస్ట్

సిటీబ్యూరో, మార్చి 15(నమస్తే తెలంగాణ): ప్రీ లాంచ్ పేరుతో 300 మంది కష్టమర్ల నుంచి కోట్ల రూపాయల వసూలు చేసి మోసానికి పాల్పడ్డ భువన తేజ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ కేసులో మరో ఇద్దరు నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ డీసీపీ శ్వేత తెలిపారు. జూబ్లీహిల్స్‌కు చెందిన ఏ4, ఏ5 నిందితులు జెర్రిపోతుల ఫణి భూషణరావు, జెర్రిపోతుల రాజ్ కుమార్‌లను అరెస్ట్ చేసినట్లు డీసీపీ తెలిపారు. వీళ్లు హ్యాపీ హోమ్స్ పేరుతో, శామీర్‌పేట్‌లో ప్రాజెక్ట్‌ను ప్రారంభించి రూ.80 కోట్ల వరకు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారని వివరించారు.

గిరిజన విద్యార్థుల విదేశీ రుణాల్లో కొర్రీలు

- విదేశాల్లో చదువుతున్న విద్యార్థుల గ్రాంట్స్ ఆపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులిస్తే.. పలు కారణాలతో ఆపుతున్న ప్రస్తుత ప్రభుత్వం
- స్కాలర్ షిప్‌లు అందక అగమ్యగోచరంగా విదేశీ విద్యార్థుల పరిస్థితి
- పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్ షిప్‌ను రూ.40 లక్షలకు పెంచాలి
- ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో బాధిత ఎస్టీ విద్యార్థుల ధర్నా

ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా చేపడుతున్న బాధిత విద్యార్థులు

కవాడిగూడ, మార్చి 15: విదేశాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు గ్రాంట్స్ ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కొర్రీలు పెట్టి ఆపుతుందని బాధిత విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. వందలాది మంది విద్యార్థులకు ప్రస్తుత ప్రభుత్వం స్కాలర్ షిప్స్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నదని, దీని కారణంగా విదేశాల్లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యిందని బాధిత విద్యార్థులు శంకర్ కుమార్, బద్రీ రాథోడ్, జమున, లకావత్ మాన్‌సింగ్, రాంబాబు, తులసీరామ్, భాస్కర్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి తల్లిదండ్రుల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ కేవలం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్య చదువు కోసం ఏర్పాటు చేసిన పథకం అని, ఆ పథకం ప్రకారం విదేశీ విద్యా చదువుకోవడానికి ఎంత మంది వెళ్లినా సంతృప్తి స్థాయిలో స్కాలర్ షిప్‌లను ఇవ్వాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించి నిధులు మంజూరు చేసిందన్నారు. కాని, ప్రస్తుతం విద్యార్థులకు గ్యాప్ వచ్చిందని, ఇతరత్రా అనేక కారణాలు చూపి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని వారు మండిపడ్డారు. తాజా లెక్కల ప్రకారం, 206 మంది విద్యార్థులు విదేశాలకు వెళితే, 136 మంది విద్యార్థులు హార్డ్ కాపీ సబ్మిషన్‌కు అంగీకరించి, 126 మందిని ఇంటర్వ్యూ చేసి 63 మందిని సెలెక్ట్ చేసిందని, మిగతా 143 మందిని రిజెక్ట్ చేసిందని అన్నారు. జీఓ నం. 36 ప్రకారం, ఒక ఎస్టీ విద్యార్థి 35 ఏండ్ల వరకు ఉన్నత విద్య చదవడానికి అర్హుడని, దీన్ని పరిగణనలోకి తీసుకోవట్లేదని వారన్నారు. దీని వల్ల విదేశాల్లో చదువుతున్న ఎస్టీ విద్యార్థులు తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇంటి నుంచి డబ్బులు రాక, ప్రభుత్వం ఇవ్వక, బ్యాంకుల నుంచి లోన్‌లు రాక నరక యాతన అనుభవిస్తున్నారని అన్నారు. ఎస్టీ విద్యార్థులకు రావాల్సిన అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్ షిప్‌ను రూ.40 లక్షలకు పెంచాలన్నారు. ఎంత మంది విదేశాలకు వెళ్లి చదివితే అంత మందికి స్కాలర్ షిప్‌లను ఇవ్వాలని అన్నారు. మార్కుల పేరుతో విద్యార్థుల సంఖ్యను 5 వరకు తగ్గించడాన్ని మానుకోవాలన్నారు. వివిధ కారణాలతో గ్యాప్ వచ్చిన విద్యార్థులను కూడా పరిగణనలోకి తీసుకొని స్కాలర్ షిప్‌లను ఇవ్వాలన్నారు. సీఎం వెంటనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్‌లపై సమీక్ష నిర్వహించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రిలయన్స్ రిటైల్‌లో లేడీ లీ కూపర్..

జూబ్లీహిల్స్, మార్చి 15: రిలయన్స్ రిటైల్ సేల్స్‌లో దిగ్గజ డెనిమ్ బ్రాండ్ 'లీ కూపర్' మహిళా పాదరక్షల విభాగాన్ని నిర్వాహకులు ప్రవేశపెడుతున్నారు. ముంబైలో శుక్రవారం జరిగిన నో షూ పార్టీ కార్యక్రమంలో నటి సాన్య మల్హోత్రా 'స్ప్రింగ్ సమ్మర్ 24 కలెక్షన్'ను ప్రారంభించింది. ఈ సందర్భంగా సాన్య మాట్లాడుతూ, లీ కూపర్ పాదరక్షలు స్వీయ వ్యక్తీకరణ, వ్యక్తిత్వానికి దర్పణంగా ఉంటాయని పేర్కొన్నారు. 'షూస్ డోంట్ జడ్జ్' పేరుతో నిర్వహించిన ''నో షూ'' పార్టీలో పలువురు ప్రముఖులు, మహిళలు లీ కూపర్ పాదరక్షల ప్రపంచంలో అడుగుపెట్టి ఆనందోత్సాహాలతో పాల్గొని ఎంపిక చేసుకున్న శ్రేణులను బహుమతులుగా పొందారు.

అంతరాయం లేని విద్యుత్

క్షేత్ర స్థాయిలో సెక్షన్ అధికారులతో ఎఫ్‌ఓసీ విభాగం పనిచేసేలా సీఎండీ ఆదేశాలు



సిటీబ్యూరో, మార్చి 15(నమస్తే తెలంగాణ): క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరా తీరు తెన్నులపై విద్యుత్ శాఖ ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించింది. ఎంత డిమాండు వచ్చినా సరఫరా చేసేంత విద్యుత్ గ్రిడ్‌ల నుంచి అందుబాటులో ఉంది. అయినా 'విద్యుత్ అంతరాయాలు ఎందుకు వస్తున్నాయి' అనే అంశంపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ప్రత్యేకంగా సమీక్షించి, విద్యుత్ సరఫరా వ్యవస్థలను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. ప్రధానంగా డిస్కం పరిధి పట్టణ ప్రాంతంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉంది. ఇందులో పట్టణ ప్రాంతమైన జీహెచ్‌ఎంసీ పరిధిలోనే సింహభాగం ఉంది. ఇందులో తొమ్మిది సర్కిళ్లు పట్టణ ప్రాంతంలోనే ఉండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వాటిపై వస్తున్న ఫిర్యాదులను సీఎండీ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా పలుమార్లు సమీక్షించారు. ఇందులో మెట్రో జోన్‌లోని హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్లలో విద్యుత్ సరఫరా, విద్యుత్ అంతరాయాల విషయంలో సెక్షన్ ఏఈతో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ బృందాలు కలిసి పని చేయాలని ఆదేశించారు.

మెట్రో జోన్‌లో ఎవరికి వారే అన్నట్లుగా...

నగరంలో విద్యుత్ అంతరాయాలు తలెత్తితే 1912కు ఫిర్యాదు చేయడంతో పాటు స్థానికంగా ఉండే ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ)కు వినియోగదారులు ఫిర్యాదు చేస్తుంటారు.